క్లుప్తంగా

ఘనంగా గోదాదేవి కల్యాణం



చంద్రుగొండ: కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన పూజారి బోడెం వెంకన్నశాస్త్రీ, విప్పర్ల భాస్కరశర్మ పూజలు జరిపించారు.

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస చివరి రోజు కావడంతో అర్చకులు శ్రీమాన్ ఆరుట్ల రాజగోపాలాచార్యుల నేతృత్వంలో నిర్వహించిన ఈ కల్యాణోత్సవం వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు శీరపు వీర రాఘవరెడ్డి, సభ్యులు పిలకా నాగేంద్రరెడ్డి, పతివాడ జగదీష్, పంపన శివరావు, వాకచర్ల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో చాత్తద శ్రీవైష్ణవి సంఘం భద్రాచలం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో శ్రీగోదారంగనాథుల తిరు కల్యాణ మహోత్సవ వేడుక ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నప్రసాదాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ శాఖ అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్, కార్యదర్శి గోవర్ధన శేషావతారం, సత్యనారాయణ, పాంచజన్య స్వామి, మధు స్వామి, తాయరమ్మ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మిట్టగూడెం కాలేజ్



విజేతగా నిలిచిన మిట్టగూడెం డిగ్రీ కాలేజీ జట్టు

అశ్వాపురం: మండల కేంద్రంలో తురుములగూడెంలో గుగులోత్ జయరాం జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతగా మిట్టగూడెం డిగ్రీ కాలేజీ జట్టు నిలిచింది. రెండో స్థానంలో గొందిగూడెం, మూడో స్థానంలో చింతిర్యాలగూడెం, నాలుగో స్థానంలో గొందిగూడెం కొత్తూరు జట్లు నిలిచాయి. ఎస్వీఆర్ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ కిషోర్‌శివరాంనాయక్, సర్పంచ్ కమల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నిర్వాహకులు, రాంసింగ్, వీరన్న, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభం..

చర్ల: దుమ్ముగూడెం మండలంలోని అచ్యుతాపురంలో ఆదివాసీ యువజన సంఘం, ఆదివాసీ మహిళా సంఘం, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో దివంగత సోయం నవీన్ కుమార్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చర్ల, దుమ్ముగూడెం మండలాల వాలీబాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్థానిక సర్పంచ్ బూటారి నాగమణి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏజే ప్రభాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ వాలీబాల్ పోటీలకు రెండు మండలాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరవనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

బూర్గంపాడు: అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఇరవెండి గ్రామంలో శ్రీరామ పూజిత అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఇరవెండిలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీరామ పూజిత అక్షింతలు, అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలు, కరపత్రాలను అందజేశారు. ప్రముఖులు తాళ్లూరి పంచాక్షరయ్య, సర్పంచ్ కొర్సా లక్ష్మి, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర కమిటీ జిల్లా ప్రతినిధులు నాగభూషణశాస్త్రి, రాజశేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద..

- సొంత గ్రామాలకు చేరుకున్న జనం
- ఘుమఘుమలు వెదజల్లుతున్న పిండివంటలు
- బసవన్నల సందడి, ఇంటింటికీ హరిదాసులు



చర్ల: పల్లెల్లో డూడూ బసవన్నల సందడి



కరకగూడెం: ఓ ఇంట్లో పిండివంటలు చేస్తున్న మహిళలు

చర్ల: పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం పల్లెల్లో నుంచి పట్టణ బాట పట్టి జీవనాన్ని సాగిస్తున్న జనం సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు చేరారు. అల్లుల్లు, ఆడబిడ్డలు, మునమళ్లు, మనుమరాళ్లు ఇళ్లకు చేరుతుండడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సెలవులు ఇవ్వడంతో వారంతా పల్లెబాట పట్టారు. దీంతో పల్లెల్లో ఇళ్లన్నీ కళ కళలాడుతున్నాయి. పెద్ద ఎత్తున సంక్రాంతి సందడి కనిపిస్తోంది. ఇప్పటికే భోగి వేడుకలు జరగగా.. నేడు సంక్రాంతి, రేపు కనుమ పండుగలను జరుపుకోనున్నారు.

చిన్నారుల కోలాహలం..

హాస్టల్లో ఉండే విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడం, పట్టణాల్లో ఉండే మనువళ్లు, మనుమరాళ్లు అమ్మమ్మ, నానమ్మల ఇళ్లకు చేరుకోవడంతో పల్లెల్లో చిన్నారుల కోలాహలం కనిపిస్తోంది. నదులు, చెరువులు, పంట పొలాల వద్దకు పెద్ద ఎత్తున చేరుకుంటున్న చిన్నారులు.. అరుపులు కేరింతలతో సందడి చేస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పతంగులను ఎగుర వేస్తూ ఆనంద పరవశులవుతున్నారు. పల్లెలు, పట్టణాల శివారు ప్రాంతాలు, క్రీడా ప్రాంగణాలలో పెద్ద ఎత్తున చేరి రంగు రంగుల గాలి పటాలను ఆకాశంలోకి ఎగుర వేస్తూ కేరింతల్లో మునిగి తేలుతున్నారు. వీధుల్లో పలు రకాల ఆటలాడుతూ పల్లెలకు వన్నెతెచ్చారు. పల్లెలన్నీ ఎప్పుడూ ఇలాగే ఉంటే బాగుండు అంటూ వారి అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు చర్చించుకరోవడం కనిపిస్తోంది.

సందడి చేస్తున్న బసవన్నలు..

సంక్రాంతిని పురస్కరించుకుని మండల కేంద్రాలతో పాటు పల్లెల్లోనూ డూడూ బసవన్నల సందడి మొదలైంది. వారం రోజుల నుంచే తెల్లవారుమునే గంగిరెద్దులు విన్యాసాలు చేస్తున్నాయి. వాయించే మేళాలు, పాడే సన్నాయిలు, ఊదే బూరల స్వరాలకు బసవన్నలు లయబద్ధంగా తల ఊపుతూ అబ్బుర పరుస్తున్నాయి. ఇళ్ల ముంగిళ్లల్లో వేసే ముగ్గులో గంగిరెద్దు నిబడితే ఆ ప్రాంతం సుఖ సంతోషాలతో శోభిల్లుతుందనే నమ్మకంతో ఇళ్ల ముంగిళ్లకు వచ్చే గంగిరెద్దులపై నూతన వస్త్రాలు వేస్తున్నారు. వాటికి దానాగా పండించిన ధాన్యం తినిస్తున్నారు.

హరిదాసుల కీర్తనలు..

సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా సంక్రాంతి వేళల్లో వచ్చే హరిదాసులు ఈ సారి కూడా పల్లెల్లో సందడి చేస్తున్నారు. హరిదాసులు రామ నామ స్మరణలతో పల్లెలు, పట్టణాలను హోరెత్తిస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే హరిలో రంగ హరి అంటూ వారి గాత్రాన్ని అరంభిస్తూ పల్లెలు పట్టణాలను మేల్కొపుతున్నారు. సంక్రాంతిని సంబురంగా జరుపుకుందామంటూ వారి గాత్రాలతో హోరెత్తిస్తున్నారు.

పిండివంటల్లో నిమగ్నమైన మహిళలు

కరకగూడెం: పండుగకు వారం ముందునుంచే అందరి ఇళ్లలో కమ్మని పిండివంటలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు. ఒక వీధిలోని మహిళలంత మొదట ఓ ఇంట్లో పిండివంటలు చేసి ఆ తరువాత అందరూ కలిసి మరో ఇంటికి వెళ్లి ఆత్మీయంగా కలిసి కష్టసుఖాలను పంచుకుంటూ పిండివంటల తయారుచేస్తున్నారు. కాగా పిండివంటలైన సకినాలు, గారేలు, అరిసెలు, చేగోడిలలోని ఎన్నో పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో ఉండే బీ1, బీ3, బీ6, ఏ విటమిన్, ఐరన్, గ్లూకోజ్, కార్బోహైడ్రేట్స్, ఎలక్ట్రోలైట్స్ మానవశరీరానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు తెలుపుతున్నారు. వీటికి తోడు సంక్రాంతిలో గొబ్బెమ్మ, బోగిమంటలు, పిల్లల గాలిపటాలు, అన్నదాతల ఇంట ధాన్యలక్ష్మీతో సంక్రాంతి అందరి ఆత్మీయక్రాంతి.



చర్ల: రామనామస్మరణతో హరిదాసు..

మరమ్మతులు చేపట్టండి..



ఎమ్మెల్యే పాయంను సన్మానిస్తున్న సమితి బాధ్యులు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన ఆయా శాఖల అధికారులతో చరవాణిలో మాట్లాడారు. పినపాక నియోజకవర్గంలో పలు చోట్లు ప్రధాన రహదారి ఘోరంగా దెబ్బతిన్నదని, పలు ప్రాంతాల్లో గతంలో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైందని అన్నారు. మేడారం జాతర సమీపిస్తున్నందున మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారి వాహనాల రద్దీ పెరుగుతోందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రహదారులకు వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులకు సూచించారు.

పాయంకు సన్మానం..

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును జాతీయ మానవహక్కుల, వినియోగదారుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందాడి సంజీవరావు, ప్రతినిధులు ఆదివారం వారి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. మానవ హక్కుల పరిరక్షణలో సంస్థకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

పినపాక నియోజకవర్గ ప్రజలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి పర్వదినం నుంచి ప్రజల జీవన విధానాలలో సుఖసంతోషాలు వెల్లివిరాయాలని ఎమ్మెల్యే పాయం ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

కొనసాగుతున్న 'యూసుఫ్' టోర్నీ

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 16వ యూసుఫ్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. ఆదివారం జరిగిన తొలిమ్యాచ్‌లో రామవరం విరాట్ ఎలెవన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. అనంతరం 75 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంజర ఫ్రెండ్స్ ఎలెవన్ జట్టు 7 వికెట్లు నష్టపోయి 63 పరుగులు చేసి ఓటమి పాలైంది. రెండవ మ్యాచ్‌లో వారియర్స్ ఎలెవన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 75పరుగులు చేసింది.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్కై ఎలెవన్ జట్టు 7.4 ఓవర్లలో 81 పరుగులు చేసి విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో పాల్వంచ శ్రీరామ్ ఎలెవన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో8 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సారపాక తేజ ఎలెవన్ జట్టు 7.4 ఓవర్లలో 96 పరుగులు చేసి విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో కొత్తగూడెం సాధన ఎలెవన్ జట్టుపై పాల్వంచ ఫరీద్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచిన సురేష్, పండు, శ్రీరామ్, భరత్‌లకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు దక్కాయి. వీరికి నిర్వాహక కమిటీ ప్రతినిధులు అవార్డులను అందించారు.



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందిస్తున్న నిర్వాహక కమిటీ ప్రతినిధులు

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

కరకగూడెం: ఆపదలో ఉన్న నిరుపేదలకు సేవ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలని 'ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్'సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యుడు షేక్ సోందు పాషా అన్నారు. ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా కరకగూడెం మండలంలోని నర్సంపేట,మోతె గ్రామాలకు చెందిన దొడ్డి సూర్యం,మెంతిని శంకర్ల ఇళ్లులు దగ్ధమయ్యాయి. విషయం తెసులుకొని ఆదివారం బాధిత కుటుంబాలకు ఫౌండేషన్ తరపున 50 కేజీల బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, దోమతెరలు, పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీతో పాటు 2వేల నగదును వారి వారి ఇళ్ల వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్ సేవలను రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు సమీర్,ఆరిఫ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వితరణ..

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలు, వృద్ధులకు దుస్తులను వేర్వేరుగా వితరణగా అందించారు. ఆదివారం మండలంలోని దురదపాడు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అశ్వారావుపేటలోని అమ్మ సేవా సదనంలోని అనాథ వృద్ధులకు వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చీరలు, దుస్తులు, స్వీట్లు పంచారు. ఎంపీటీసీ సభ్యులు పండా రాజు, కుంజా అర్జున్, రాజులు, పండా ముత్యాలు, కాకా చంద్రం, మడకం వెంకటేశ్వరరావు, వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం బాధ్యులు రాంబాబు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, బాలగంగాధర్, కుమార్ రాజా, జల్లిపల్లి గుప్తా, శీమకుర్తి సుబ్బారావు, దేవరాజ్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు, బహుమతులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేషన్ బహుమతులను ఎస్సై సురేష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఎంపీటీసీలు కమటం నరేష్, గాదె జయ, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, క్రీడాకారిణి చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు కొండబత్తుల ఉపేందర్, కొప్పుల శ్రీనివాసరెడ్డి, కృష్ణామాచారి, పర్వత నరేష్, సుతారపు రంగయ్య, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, చిట్యాల సత్యం పాల్గొన్నారు.

'మన గ్రోమోర్' ఆధ్వర్యంలో..

అశ్వాపురం కోరమాండల్ సెంటర్ వారు మన గ్రోమోర్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల కేంద్రంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ బాలకృష్ణ, అశ్వాపురం మన గ్రోమోర్ స్టోర్ మేనేజర్ కిషన్ పాల్గొన్నారు.

శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలో కాలువబజార్‌లో శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ బాణోత్ శారద బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, చంద్రకళ, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని జగ్గారం, గుర్వాయిగూడెం గ్రామాల్లో భోగి పండుగ సందర్భంగా ముగ్గులు, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఆదివారం నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటుగా షీల్డ్‌లను ఎస్సై రవికుమార్ చేతులమీదుగా అందజేశారు. ఈ బహుమతులను చేగువేరా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. కారం శ్రీరాములు, వసంత్, నర్సింహారావు, మహేష్, భద్రమ్మ పాల్గొన్నారు.

బూర్గంపాడు: ఐద్వా ఆధ్వర్యంలో సారపాకలోని సుందరయ్యనగర్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలు శ్యామల, అనిత, మంజులకు నిర్వాహక కమిటీ ప్రతినిధులు బహుమతులను అందజేశారు. పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, బాల నర్సారెడ్డి, ఇంగువ రమేష్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొలమారి రత్నారెడ్డి, భూక్యా రమేష్, బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజని, ఎస్‌కె.అబీదా, నాగమణి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కుంకుడుచెట్ల గుంపులో యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. వైస్‌ఎంపీపీ కేవీ రావు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దమ్మపేట: ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



అశ్వాపురం: మొండికుంటలో బహుమతులు అందజేస్తున్న ఎస్సై సురేష్‌కుమార్



బూర్గంపాడు: ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఘనంగా భోగి వేడుకలు



కరకగూడెం: చిన్నారిపై భోగి పండ్లు వేస్తున్న దృశ్యం



దమ్మపేట: భోగి మంటల వద్ద ప్రజలు



అశ్వారావుపేటరూరల్: వాసవి ఆలయంలో భోగి సంబరాలు



భద్రాచలంటౌన్: పట్టణంలో భోగి మంటలు వేసిన ఓ కాలనీ వాసులు

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా భోగిపండుగ పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు వేకువజామునే నిద్రలేచి భోగి మంటలు వేసుకుని ఆనందంగా సందడి చేశారు. భోగి సందర్భంగా మహిళలు ఇళ్లువాకిళ్లను శుభ్రం చేసుకుని.. వాకిళ్లలో రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్దారు. అనంతరం ఇంటిల్లిపాది అభ్యంగన స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించారు. అనంతరం పూజామందిరాల్లో దేవతమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ధూపదీప నైవేథాలను సమర్పించారు. మరికొంతమంది ప్రజలు సమీప ఆలయాలకు వెళ్లి స్వామివార్లకు, అమ్మవార్లకు పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు.

దమ్మపేట: మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ భోగి పండుగను పురస్కరించుకుని వేడుకలు జరుపుకున్నారు. వేకువజామునే భోగి మంటలను వేశారు. ఆదివారం భోగి మంటల నుంచి వచ్చే వెచ్చని వేడికి పెద్దలు, పిల్లలు అందరూ చలి కాగారు. మహిళలు, యువతులు ఇంటిముందర రకరకాల రంగులతో చూడచక్కని రీతిలో ముగ్గులు వేశారు. కుటుంబ సభ్యులందరూ తలంటు స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించారు. సమీపంలోని ఆలయాలకు వెళ్లి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తల్లితండ్రులు, తమ చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి, సంబురాలు జరుపుకున్నారు. అనంతరం మహిళలు రకరకాల పిండి వంటలను తయారు చేసే కార్యక్రమంలో నిమగ్నం అయ్యారు.

అన్నపురెడ్డిపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మండలంలోని అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట, అబ్బుగూడెం, రాజాపురం, పెంట్లం తదితర గ్రామాలలో ప్రజలు భోగి మంటలు వేశారు. మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో భోగి మంటలు వేసి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి భోగిపండ్లతో అభిషేకాలు జరిపించారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రజలు భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన సెంటర్లతో పాటు కాలనీలలో ఉదయాన్నే భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యువత గాలి పటాలను ఎగురవేస్తూ ఉల్లాసంగా గడిపారు.

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి సందర్భంగా తొలి రోజు భోగి వేడుకలను ఇంటింటా ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం మండలంలోని ఊట్లపల్లి, జమ్మిగూడెం, అచ్యుతాపురం, నారాయణపురం, వినాయకపురం కాలనీ, వినాయకపురం, నారంవారిగూడెం, తిరుమలకుంట, నారాయణపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, గుమ్మడవల్లి, అనంతారం, పేరాయిగూడెం, అశ్వారావుపేటతోపాటు అన్నీ గ్రామాల్లో తమ తమ ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న భోగి మంటలతో సందడి చేశారు. ఉదయాన్నే భోగి మంటలను సిద్ధం చేసి ఇంట్లో పనికి రాని పాత సామన్లు, పాత వస్తువులు, చీపుర్లు, పిడికలు సేకరించి భోగి మంటల్లో కాల్చారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేసుకున్నారు. స్థానిక వాసవీ అమ్మవారి ఆలయంలో కుడా భోగి పండుగ సంబరాలు నిర్వహించారు. అదే విధంగా చిన్నారుల తలలపై భోగి పండ్లు వేసి పెద్దలు ఆశీర్వదించారు.

కరకగూడెం: మండల వ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటల కాంతులు విరజిమ్ముతు తమ కష్టాలను తొలగించాలని ప్రజలు అగ్ని దేవుడిని ప్రార్థించారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలతో ఇళ్ల ముంగిళ్లలో మహిళలు ముత్యాల ముగ్గులు వేసి నవధాన్యాలు, రేగు పండ్లు, గరక పోచ, పిండిపూల మొక్కలను వేసి ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు పెట్టి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు భోగి పండ్లు పోశారు. అంతటా పండుగ వాతావరణం నెలకొంది.

మణుగూరురూరల్: భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం భోగి మంటల సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ జాగృతి జిల్లా అధ్యక్షుడు పవన నాయక్ మాట్లాడారు. నాయకులు శివకృష్ణ, ఆదిత్య, కార్తీక్, చందు, చింటు,ముబీన్, ఉదయ్, ఇంజమామ, ఉదయ్, నిధిష్, సాయి, సాయి ప్రణీత్, నీరజ్, వినోద్, విక్కీ, ఓంకార్, ప్రణయ్, యశ్వంత్, మధు, సురేష్, శివమణి తదితరులు పాల్గొన్నారు.